క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఉచిత కోచింగ్ విద్యార్థులు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లో ప్రతిభచూపారని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా గౌరవ సలహాదారుడు గోపినాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో గురువారం పాలిసెట్ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఆర్‌జేసీ పరీక్షలో బి.సంజనరెడ్డి 365, ఎస్.హంస్పేస్ వల్లి 7867 ర్యాంకులు సాధించారన్నారు. పాలిసెట్‌లో ఎం.లోక్ నాథ్ 2080, జె.హరికేశవరావు 2826, ఎస్ఎస్ జుబేదా 5546, కె.యశ్వంత్ 6733, పి.హాసిని 7573, పీవీ సాయిచరణ్ 7879 ర్యాంకులు సాధించారని వివరించారు. పరీక్షలు రాసిన ప్రతి ఒక్కరూ క్వాలిఫై అయ్యారన్నారు. మూడేళ్లుగా జేవీవీ ఆధ్వర్యంలో పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతోపాటు గౌతమి ఇంజనీరింగ్ కాలేజీ సహకారంతో స్టడీ మెటీరియల్ అందించామన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు వేంపల్లి రాజశేఖర్, దేవానంద్, రాకేష్, గురు, మహమూద్, జీటీ ఈశ్వరయ్య, తిరుమల కొండు, అల్లాబకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



రామయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ రామయ్య ఇటీవల గుండె జబ్బుతో ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గురువారం రామయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైస్ ఎంపీపీ సీఎం బాషా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్‌బాషా, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాదిలి మస్తాన్, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరానికి చెందిన గద్దం వెంకట సుబ్బయ్య గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రొద్దుటూరు పద్మశాలీయ సంఘం వారికి ఆర్థిక సహాయం చేయాలని ఆయన విన్నవించారు. స్పందించిన సంఘం అధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, శ్రీరామ్ నగర్ శ్రీభద్రావతి భావనారుషి ఆలయ అధ్యక్షుడు వద్ది బాలుడుతోపాటు మరికొందరు గురువారం రామేశ్వరంలోని గద్దం వెంకటసుబ్బయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.16వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో దాతలు చింపిరి రమణ, చెన్నా శ్రీనివాసులు, శిలివేరి సుబ్రహ్మణ్యం, చెన్నా కృష్ణమూర్తి, మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పుస్తకాల వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి గురువారం మానవతా సేవా ట్రస్టు వారు డీఎస్సీ పోటీ పరీక్షల పుస్తకాలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా మానవతా సేవా ట్రస్టు డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తోపాటు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. రూ.2,721 విలువ డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పుస్తకాలను అందించామని, ఇవి అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

పోరుమామిళ్ల : విజయనగరం రాజీవ్‌స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 12 నుంచి 15 వరకు నిర్వహించిన తైక్వాండో జాతీయస్థాయి సెమినార్‌లో పోరుమామిళ్లకు చెందిన విద్యార్థులు తస్లీమ్, నిఖిల్, దినేష్‌లు పాల్గొన్నట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. 3వ జాతీయ తైక్వాండో ఫైట్ టెక్నిక్ సెమినార్‌లో పాల్గొనేందుకు పోరుమామిళ్ల నుండి ముగ్గురికి అవకాశం లభించిందన్నారు. సెమినార్‌కు కోచ్‌గా ఇరాన్‌కు చెందిన వరల్డ్ ఛాంపియన్ షిప్ ప్లేయర్ అబ్బాస్ షెకీ వచ్చారన్నారు. ఆయన ఇంటర్‌నేషనల్ కోచ్ అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, కేరళ నుండి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

అరటి చెట్లు నరికివేతపై ఫిర్యాదు

మైదుకూరు : తమ పొలంలోని అరటి చెట్లను తమ దాయాదులు నరికి వేశారని మండలంలోని ముదిరెడ్డిపల్లె సుగాలి తండాకు చెందిన బుక్కే రవిశంకర్ నాయక్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల కిందట తమ దాయాది వరుసకు చిన్నాన్న అయిన ధనకా నాయక్‌కు చెందిన పొలాన్ని తాము కొనుగోలు చేశామని, అయితే ఆ పొలంలో సమాధుల కోసం కొంత స్థలం ఇవ్వాల్సిందిగా ఏడాది కాలంగా తమ చిన్నాన్న అడుగుతున్నారని, నిరాకరించడంతో గురువారం తమ పిన్నతల్లి పాపులమ్మ, వారి కుమారుడు రవిశంకర్ తమ పొలంలోని సుమారు 50 చెట్లను నరికి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజాస్వామ్యయుతంగా ఉప సర్పంచ్ ఎన్నిక జరిపించండి

- వైఎస్సార్‌సీపీ బలం తగ్గలేదు.. టీడీపీ బలం పెరగలేదు
- నిష్పక్షపాతంగా ఎన్నిక జరిపిస్తే వైఎస్సార్‌సీపీదే విజయం
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈనెల 19న ఉదయం 11 గంటలకు జరగనుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గత మార్చి 27న వాయిదా పడిన ఎన్నికను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆయన గురువారం గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ ఉప సర్పంచ్ ఎన్నికకు సంబంధించి మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్నారన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో ఒక స్థానాన్ని మాత్రమే టీడీపీ మద్దతుదారులు గెలుచుకోగా, వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు 19 స్థానాల్లో విజయం సాధించారన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు కొంత మంది వెళ్లడంతో టీడీపీ సభ్యుల సంఖ్య ఆరుకు చేరిందని, 14 మంది వైఎస్సార్‌సీపీ తరపున ఉన్నారన్నారు. మార్చి నెలలో జరిగిన ఎన్నిక సందర్భంగా తమ వార్డు సభ్యుడు పవన్ కుమార్ అనే వార్డు సభ్యున్ని పోలీసులే కామనూరు గ్రామానికి పంపించారన్నారు. ప్రస్తుతం తమ వైపు 13 మంది, టీడీపీ వైపు 7 మంది వార్డు సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా అధికారులు ఎన్నిక జరిపిస్తే తామే విజయం సాధిస్తామని రాచమల్లు స్పష్టం చేశారు. స్థానిక పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం వల్లే గతంలో ఎన్నిక వాయిదా పడిన విషయాన్ని తెలిపారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీకి మెజారిటీ సభ్యులు ఉన్నా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫేక్ ఐడీలతో వార్డు సభ్యులను తయారు చేసి దొంగదారిన ఉపసర్పంచ్ పదవిని గెలిచేందుకు ప్రయత్నించారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎక్కడా ఇలాంటి సంఘటన చోటు చేసుకోలేదన్నారు. విధుల్లో ఉన్న అధికారి వల్లే ఫేక్ ఐడీ సభ్యులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం స్థానిక పోలీసుల సామర్థ్యం సరిపోకపోతే పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న మిలటరీ సిబ్బందిని రప్పించాలని వ్యంగ్యంగా అన్నారు.

ఎన్నికల అధికారికి గుండెపోటు రాకుండా చూడండి..

నిబంధనల ప్రకారం ఉప సర్పంచ్ ఎన్నిక జరిగితే వైఎస్సార్‌సీపీ మద్దతు వార్డు సభ్యులే విజయం సాధిస్తారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు స్పష్టం చేశారు. పోలీసులు సమర్థవంతంగా ఎన్నిక నిర్వహించడంతోపాటు ఎన్నిక నిర్వహించే అధికారికి గుండెపోటు రాకుండా ముందుగా అపోలో, కేర్ లాంటి ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. ఎన్నికలు జరిగే కార్యాలయంలో వార్డు సభ్యులు మాత్రమే ఉండాలని, గతంలోలా టీడీపీ నాయకులు ఎవ్వరు లోనికి వెళ్లకుండా చూడాలని కోరారు. పోలీసు బందోబస్తుతో తమ వార్డు సభ్యులను తీసుకెళ్లినా పెద్దమ్మ చెట్టు వద్ద ఉన్న టీడీపీ రౌడీలు రాళ్లు వేసి తమ సభ్యులను గాయపరిచారన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకూడదని తెలిపారు. ఈ ఎన్నికలో తాము ఓడినా, గెలిచినా నష్టం ఏమి లేదని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక భద్రత ఏర్పాట్లను నిర్వహించి ప్రశాంతంగా ఎన్నిక జరిగేలా చూడాలని కోరారు. నిష్పక్షపాతంగా ఎన్నిక నిర్వహించకపోతే తర్వాత జరిగే దుష్పరిణామాలకు టీడీపీ నేతలతోపాటు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో సర్పంచ్ మోషా, ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డితోపాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై చెన్నకేశవుడు



వెల్లాలలో అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజైన గురువారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను అశ్వ వాహనంపై వైభవంగా ఊరేగించారు. ముందుగా స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఆశీనులు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మినారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు, భక్తులు పూజలు చేశారు.

సచివాలయాల్లో నీటి సమస్య

గోపవరం : మండలంలోని గ్రామ సచివాలయాల్లో నీటి సమస్య నెలకొంది. దీంతో పనిచేస్తున్న సిబ్బంది టాయ్‌లెట్లకు వెళ్ళాలన్నా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా సచివాలయాల్లో మహిళా ఉద్యోగులు ఎక్కువ మంది ఉండటంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒక్కొక్కసారి టాయిలెట్లకు వెళ్ళేందుకు సమీపంలోని ఇళ్ళకు వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని సచివాలయాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఆ అవకాశం కూడా లేకుండా పోతుంది. మండల వ్యాప్తంగా ఆరు సచివాయాలు ఉండగా ఒక్క సచివాలయానికి కూడా నీటి వసతి లేదు. సచివాలయాల్లో నీటి వసతి కల్పించాలని అనేకమార్లు సిబ్బంది మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. అయినా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సర్పంచ్‌ల ద్వారా అయినా సచివాలయాలకు నీటి సౌకర్యం కల్పించే అవకాశం ఉంది. అయినా ఆ దిశగా కూడా సంబంధిత అధికారులు ప్రయత్నం చేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

మండల అభివృద్ధి కార్యాలయంలో కూడా ఇదే దుస్థితి

మండల అభివృద్ధి కార్యాలయంలో కూడా నీటి సమస్య ఏర్పడింది. అధికారులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ కూడా మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల అభివృద్ధి కార్యాలయానికి మరమ్మతులు చేశారు కాని నీటి వసతి కల్పించలేదు. ఇక్కడ కూడా అనేకమార్లు సిబ్బంది సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కార్యాలయంతో పాటు సచివాలయాల్లో నీటి వసతి కల్పించి సిబ్బంది పడుతున్న ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలువలు పొంగిపొర్లుతున్నాయన్నారు. అధికారుల పర్యవేక్షణ కరువైందని తెలిపారు. విద్య, వైద్య, వాణిజ్య రంగాల్లో ప్రొద్దుటూరు ముందుందని, మౌలిక వసతుల కల్పనలో రాజకీయ గ్రహణం పట్టి పీడిస్తోందన్నారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరారు. మున్సిపల్ కౌన్సిల్‌లో కుర్చీల కుమ్ములాట తప్ప పాలకులు ప్రజా సేవ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపాలం, రామకృష్ణ, హరి, మచ్చా శ్రీను, యల్లయ్య, దస్తగిరి, జహీర్, సంతోష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ, ఏఓ రామకృష్ణయ్య

గోపవరం : జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు బద్వేలు, గోపవరం మండలాల పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాలను ఏఓలు చంద్రమోహన్‌రెడ్డి, రామకృష్ణయ్యలతో కలిసి బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తన నిల్వలు, పురుగు మందులు, ఎరువుల నిల్వలు, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ధరల పట్టికలను రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఉంచాలని డీలర్లను ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను కొలుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు లోబడే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు రైతులకు విక్రయించాలని తెలిపారు. ప్రతి డీలర్ చట్టబద్ధ వ్యాపారం నిర్వహించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డీపీటీ 5204, ఎన్‌డీఎల్ఆర్ 7, వరి విత్తనాలు ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకెళ్ళాలని, అలాగే అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కాలం తీరిన పురుగు మందులను ఎట్టిపరిస్థితుల్లో దుకాణాల్లో ఉంచవద్దని డీలర్లను ఆదేశించారు.

సమ్మెను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

బద్వేలు అర్బన్ : కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం ఆవరణలో ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత లేకుండా అభద్రతతో జీవిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిఘటించకపోతే కార్మికవర్గం ప్రమాదంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు ఓబులేసు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ కోసం ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను చూపుతున్న కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ తదితరులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు దేశ్‌పాండే స్కిల్ వారితో ఎంఓయూ కుదుర్చుకుందని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా నిర్వహిస్తున్న తమ కళాశాల ప్రతిభను గుర్తించి ప్రభుత్వం అటానమస్ ఇచ్చిందని తెలిపారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు తెచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాన్ని కళాశాలలోనే ఇస్తారన్నారు. ప్రముఖ కంపెనీలను కళాశాలకే పిలిపించి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పృధ్వీనారాయణ, కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ శారదభవాని పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నికపై పరిశీలన

ప్రొద్దుటూరు రూరల్ : ఈ నెల 19న గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మైలవరం మండల డిప్యూటీ ఎంపీడీఓ వై.రమణారెడ్డి గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం పరిశీలించారు. ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణతో ఆయన చర్చించారు. గతంలో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నిక పరిస్థితులను, వార్డు మెంబర్ల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వార్డు సభ్యులు ఎంత మంది, ఎవరెవరికి ఎంత బలం ఉందన్న అంశంపై ఆరా తీశారు. గతంలో చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఎన్నిక సజావుగా సాగేటట్లు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత శిక్షణ

మైదుకూరు : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సాఫ్ట్‌వేర్ కోర్సులకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్ అనే రెండు కోర్సుల్లో శిక్షణ ఉంటుందని, అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మైదుకూరు పరిసర ప్రాంతాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్, ఆ పైన విద్యార్హత కలిగి బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న ప్రతి ఒక్కరూ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 93983 48760 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సీమాంక్ ఆసుపత్రి సమీపంలో గత 50 సంవత్సరాలుగా ఉన్న మాబుసుభాని దర్గా ప్రహరీగోడను కూల్చిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్‌బాషా, మాస్క్ కమిటీ అధ్యక్షుడు అల్లాబకాష్ తెలిపారు. గురువారం ప్రహరీగోడను కూల్చిన ప్రాంతాన్ని మైనార్టీ నాయకులు పరిశీలించి మాట్లాడారు. 50 సంవత్సరాలుగా మాబుసుభాని దర్గా వద్ద హిందూ, ముస్లీం సోదరులు మతసామరస్యానికి ప్రతీకగా ప్రార్థనలు నిర్వహిస్తుండేవారన్నారు. అయితే మున్సిపల్ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా ఎవరికి ఇబ్బందులు లేకున్నప్పటికీ పెద్ద ప్రహరీని కూల్చడం దుర్మార్గమన్నారు.

రేషన్‌కార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పుల ప్రక్రియను సులభతరం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అన్వర్ గురువారం తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం చేపట్టిన ప్రక్రియలో చనిపోయిన వారిని తొలగించేందుకు మాత్రమే అవకాశం ఉందని, వేరే కార్డులో ఉన్నవారిని మరో కార్డులోకి మార్చేందుకు అవకాశం లేదని తెలిపారు. అలా ఇతర కార్డుల్లో ఉన్న వారిని స్వంత కార్డులోకి మార్చేందుకు అవకాశం కల్పించాలని, చేర్పుల, మార్పుల ప్రక్రియకు సమయం పొడిగించాలని అన్వర్ కోరారు.

29 నుంచి కృషి సంకల్ప అభియాన్

మైదుకూరు : ఈనెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా అంతటా నిర్వహిస్తున్నట్టు మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆదేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. దేశంలోని 700కు పైగా జిల్లాల్లో 731 కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనుబంధ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి వ్యవసాయం గురించి రైతులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు.

పిల్లల్లో ఉత్సాహం, ఉల్లాసం కలిగించాలి

చాపాడు : పిల్లల అభివృద్ధి స్థాయిని తల్లిదండ్రులు స్వయంగా పరిశీలించి వారిలో ఉత్సాహం, ఉల్లాసం కలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రథమ్ కో–ఆర్డినేటర్ స్వరూప రాణి పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం–3లో గురువారం ఐటీసీ బంగారు భవిష్యత్తు ప్రథమ్ వారి సహకారంతో సంసిద్ధత మేళాను నిర్వహించారు. ప్రథమ్ కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లల అభివృద్ధి స్థాయి స్వయంగా పరిశీలించి ఇంట్లో అందుబాటులో ఉండే వస్తువులతో అభ్యసనం చేయించాలని దీని వలన వారిలో ఉత్సాహం, ఉల్లాసం పెరుగుతుందన్నారు. పిల్లల ఆసక్తిని బట్టి చెడు వ్యసనాలు కాకుండా మంచి చేసే పనులు చేయించాలన్నారు. పిల్లలను అంగన్‌వాడీలలో చేర్పించాలని సూచించారు.

19న బండలాగుడు పోటీలు

కాశినాయన : ఇటుగుల్లపాడు గ్రామంలో శ్రీపార్వతీ పరమేశ్వరుల శివాలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19వ తేదీన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.70 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.30 వేలు, ఐదవ బహుమతి రూ.20 వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 9440659238 నెంబరును సంప్రదించాలని కోరారు. 19వ తేదీ మధ్యాహ్నంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుడి నిరసన



అమ్మవారిశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సత్యనారాయణ

పోరుమామిళ్ల : పట్టణంలో వ్యాపారం చేసుకుంటున్న గొర్లమండల సత్యనారాయణ గురువారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నిరసనదీక్ష చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సత్యనారాయణ విలేకరులకు ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు.. ఆలయంలో తన కుటుంబానికి తీర్థప్రసాదాలు ఇవ్వడంలేదని, తాము టెంకాయ ఇస్తే తీసుకోవడంలేదని, హారతి ఇవ్వడంలేదని, షటారుకు దూరం పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ తమను బహిష్కరించడం, కులదేవతకు పూజలు చేయకుండా నిషేధించడం తమను కలచి వేస్తున్నదన్నారు. దీనితో తాను కుమిలిపోయి, ఇటీవల ఆత్మహత్యా ప్రయత్నం చేశానని, కుటుంబ సభ్యులు సకాలంలో చికిత్స చేయించడంతో బయట పడ్డానన్నారు. 12 ఏండ్ల నాడు నూతన ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇవ్వాలన్న నిర్ణయం, ఇటీవల ఆలయ భూముల అమ్మకం తదితర అంశాలలో తాము వ్యతిరేకించడం, తద్వారా విభేదాలు తలెత్తడం తదితర అంశాల కారణంగా ఆలయ కమిటీ తమపై బహిష్కరణ వేటు వేసిందన్నారు. ఇది అన్యాయమని, బహిష్కరణ రద్దు చేయాలని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని, తమ కుటుంబానికి యథావిధిగా ఆలయంలో అన్ని రకాల పూజలు జరిగేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

సురేష్‌బాబును తొలగించడం అప్రజాస్వామికం

ఖాజీపేట : కడప మేయర్ సురేష్ బాబు పదవిని రద్దు చేయడం చట్ట వ్యతిరేకం.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేయర్ ఎన్నిక సమయంలో వారికి గానీ వారి కుటుంబ సభ్యులకు గానీ కాంట్రాక్టులు ఉన్నాయా లేవా అని చూడాల్సిన బాధ్యత పూర్తిగా అధికారులదే అన్నారు. నగరపాలక అధికారులు వాటిని చూడకుండా బీసీ వర్గానికి చెందిన సురేష్ బాబు పదవి రద్దు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం బీసీ వర్గాల వ్యతిరేకత మూటకట్టుకుందని అన్నారు. మేయర్ పదవిపై అవిశ్వాస తీర్మానం చేపట్టే దమ్ము ధైర్యం కూటమి ప్రభుత్వానికి లేక చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని దొడ్డదారిన పదవీచ్యుతుడిని చేయడం అనైతికం అన్నారు. మేయర్ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేవలం రూ.36లక్షల పనులు చేశారని గద్దె దింపడం నీచమన్నారు. అక్రమాలకు ఆయన పాల్పడ్డడా లేక అవినీతి చేశారా అని ఆయన ప్రశ్నించారు. చట్టప్రకారం అధికారులపై చర్యలు తీసుకోకుండా మేయర్‌పై చర్యలు ఎలా సాధ్యమన్నారు. దీనిపై చట్టప్రకారం కోర్టులో సవాల్ చేస్తామన్నారు. తిరిగి మేయర్ పదవిపై సురేష్ బాబు గద్దె ఎక్కడం ఖాయమని ఆయన జోష్యం చెప్పారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు, సేవా సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి, ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాయం యోగయ్య, గంగసాని సాంబశివారెడ్డి తెలిపారు. ఇటీవల వెలువడిన పది ఫలితాల్లో పట్టణ పరిధిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు ఆహర్నిశలు శ్రమించాలని కోరారు. అలాగే చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, గురువుల పట్ల భక్తి, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. అనంతరం అతికారి దక్షిత, తుడిమెల్లనాగ శ్రీనిత్య, పఠాన్ తన్వీరూల్ హసన్, భరత్ మహిసాత్విక్, అనిత, సౌమ్యలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద విద్యార్థులకు నగదు బహుమతితో పాటు పురస్కారాలు అందజేశారు.

సాహిత్య పరిశోధనకు ‘కట్టా’ విశేష కృషి



కట్టా నరసింహులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీ అభిమానులు

మైదుకూరు : సాహిత్య పరిశోధనకు విద్వాన్ కట్టా నరసింహులు ఎనలేని కృషి చేశారని రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సాహిత్య పరిశోధకుడు కట్టా నరసింహులు నాలుగో వర్ధంతిని సాహిత్య అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత కట్టా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ నరసింహులు కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులుగా వ్యవహరించి కడప కైఫియత్తులను వెలుగులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం ప్రాచీనతను వెలుగులోకి తెచ్చి ప్రభుత్వ లాంఛనాలతో శ్రీరాముని కల్యాణం జరగడానికి ప్రధాన కారకులయ్యారని కొనియాడారు. సభాధ్యక్షుడు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ 2005లో కట్టా ఉద్యోగ రీత్యా విశ్రాంతి పొందిన తర్వాత కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారన్నారు. జానుమద్ది హనుమత్ శాస్త్రితో కలిసి కడప జిల్లా సంస్కృతి పుస్తకాన్ని రచించారని వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.గంగరాజు, పి.ఓబన్న, కె.ఉమాకాంత్, కైపు బాలరాజు, మురికినాటి శ్రీనివాసులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించిన జేసీ



శ్రీనివాసపురం వద్ద ఉన్న ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం వద్ద ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పరిశీలించారు. మధ్య తరగతి కుటుంబాల కోసం సరసమైన ధరలలో ప్లాట్లు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంఐజీ లేఅవుట్‌కు రూపకల్పన చేయడం జరిగింది. ఇందులో భూములు కోల్పోయిన వారికి అసైన్డ్‌మెంట్ కమిటీ ద్వారా భూములు కేటాయించారు. ప్రస్తుతం ఈ ఎంఐజీ లేఅవుట్‌ను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో జాయింట్ కలెక్టర్ ఈ లేఅవుట్‌ను పరిశీలించారు. అలాగే భూములు కోల్పోయిన వారికి అసైన్డ్‌మెంట్ ద్వారా కేటాయించిన భూములను కూడా జేసీ పరిశీలించారు. లేఅవుట్ కోసం భూములు ఇచ్చిన వారికి అన్నివిధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని జేసీ తెలిపారు. జేసీ వెంట బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అలాగే మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీలోని పరిధిలోని ప్రాజెక్టుకాలనీ–2లో ఉన్న రేషన్‌షాపును జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారుతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్డుదారులకు రేషన్ సక్రమంగా అందుతుందా లేదా అని విచారించడంతో పాటు షాపులో ఉన్న స్టాకు, బయోమెట్రిక్ మిషన్‌ను పరిశీలించారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ సరఫరా అయ్యేలా చూసుకోవాలని స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.